## 3

# రాజ్యములకు రాజ్యము

*"ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44).*

*"ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్యనివాసులనుగా చేసెను" (కొలస్సీ. 1:13).*

రేపేమి జరుగుతుందో నిజంగా తెలుసుకొన గోరుతున్నావా? బహుశా లేకపోవచ్చు. ఈనాటి బాధ్యతను భవిష్యత్ చింతలను ఒకేసారి మోయడానికి లేక భరించడానికి మన భుజాలు చాలినంతగా విశాలమైనవి కావు! "ఏనాటి కీడు ఆ నాటికి చాలు"నని అటు క్రీస్తు ప్రభువు బోధించాడు యిటు మన ఇంగిత జ్ఞానము కూడా బోధిస్తుంది (మత్తయి 6:34). అందువలననే కాబోలు దేవుడు కాలము అనే తెరను ప్రక్కకు లాగి కొద్ది మందికి మాత్రమే రాబోయే విషయాలను దృశ్య మాత్రంగా చూపించాడు. దేవుడు అలా జరిగించి నప్పుడు, పరిశుద్ధాత్మ యొక్క అద్భుత శక్తిద్వారా తన దైవికమైన ఉద్దేశాల కోసమే కాని, మనిషికున్న అనవసర కుతూహలాన్ని తీర్చడానికో లేక వాని వ్యక్తిగతమైన లాభానికో, లేక వ్యర్థమైన ఉద్రేకాన్ని ప్రోత్సహించడానికో కాదు.

ఆయన సేవకులలో ఒకనికి భవిష్యత్తును గూర్చిన సంభవాలకు తెరతీయ దలచిన సంగతి చారిత్రక గతంగా ఒకటి దానియేలు 2లో దాఖలు చేయబడింది. "రాబోయే నిత్యరాజ్యమును గూర్చిన ప్రవచనం" అని ఈ అధ్యాయానికి పేరు పెట్టవచ్చు.

బబులోను మహా రాజైన నెబుకద్నెజరు తననెంతగానో బాధించిన కలనొకటి కాంచాడు. ఆ కల ప్రాముఖ్యమైనదియు అసాధారణమైనదియునై ఉన్నదని ఎరిగినవాడై, దాని భావాన్ని చెప్పడానికి తన దర్బారులో ఉన్న జ్ఞానులను అతడు పిలువనంపాడు. వారు చెప్పే భావం యొక్క నిజాయితీని పరీక్షించడానికిగాను, మొదట తన కలను అటు తరువాత దాని భావాన్ని తెలియజెప్పుడని రాజు వారికి ఆజ్ఞాపించాడు. అందుకు, "రాజా, మొదట తమరు ఆ కలను చెప్పినట్లయితే, మేము దాని భావము తెలుప సంతోషిస్తా"మని

వారన్నారు. అందుకు రాజు, అలా కాదు. మీరు నాకు కల చెప్పాలి, కల భావము చెప్పాలి. మీరు నాకు కలయు దాని భావమును చెప్పలేకపోతే చంపేస్తాను. అయితే మీరు కలయు దాని భావం చెప్పినట్లయితే, దానములను, బహుమానములను, ప్రశస్తిని పొందుతారని మొండిగా మాట్లాడాడు. రాజు యొక్క ఆదేశం జ్ఞానులను యిరకాటంలో పెట్టింది. వారు మొదట అతని కలను బయలుపరచి దాని భావాన్ని చెప్పగలిగైనా ఉండాలి, లేదా వారు తమ అసమర్థతను ఒప్పుకోనైనా తీరాలి. ఈ అత్యవసర పరిస్థితిలో, విగ్రహ సంబంధమైన వారి మంత్ర తంత్రాలు ఏ మాత్రము పనికి రాలేదు. బొంగరుపోయిన గొంతుతో, ఆందోళన చెంది అవమానపరచబడినవారై “అది మా వలన కాదు. మాకు అసాధ్యమైన కార్యాన్ని తమరు అడిగారని” వారు ఒప్పుకున్నారు. వారి జవాబుతో కోపము చెలరేగిన నెబుకద్నెజరు, బబులోనులోని జ్ఞానులనందరిని చంపివేయమని ఆజ్ఞాపించాడు.

ఆ మరణ శాసనాన్ని బబులోనులోను రాజ్యమందంతటా అమలుపరచడానికి రాజు యొక్క అంగరక్షకుడైన అర్యోకు బయలుదేరాడు. క్రీ.పూ. 606లో యెరూషలేమునుండి బబులోనుకు తీసికొని రాబడిన దానియేలను హెబ్రీయుని దగ్గరకు వారు వచ్చారు. ఈ దానియేలు మహోన్నతుడగు దేవునియందు భయభక్తులు గలిగి ఆయనను ఆరాధించేవాడు. మరియు అతడు నెబుకద్నెజరు జ్ఞానులలో అత్యధికంగా నమ్మబడినవాడును, రాజునకు సలహాదారుడునైయున్నాడు. అలాటి మరణ శాసనాన్ని గూర్చి దానియేలు విన్నప్పుడు, అద్వితీయ సత్యదేవుడైన యెహోవా శక్తిద్వారా కలను, దాని భావాన్ని తెలియజేయుటకు రాజు వద్దకు తనను తోడుకొని పొమ్మని అర్యోకును అడిగాడు. దేవుని ప్రార్థించి కలను, దానికి గల భావాన్ని తెలుపగల జ్ఞానాన్ని పొందేలా దానియేలుకు కొద్ది సమయం యివ్వబడింది. అతడు త్వరగా దైవభక్తిగల హనన్యా, మిషాయేలు, అజర్యా అనే తన స్నేహితులను పిలువనంపాడు. వారు షద్రకు, మేషాకు, అబేద్నెగోలుగా అందరికీ తెలిసినవారు. రాజు కన్న కల దాని భావము తనకు తెలియబరచునట్లు తనతో కూడ వారును ప్రార్థనలో కలిసికొనునట్లు అతడు వారిని అడిగాడు. దేవుడు వారి ప్రార్థనలకు జవాబిచ్చాడు; వింతైన ఆ కల దాని భావము ఆ రాత్రివేళ దానియేలునకు అనుగ్రహింప బడింది. దేవునికి స్తుతులు కృతజ్ఞతలు చెల్లింపబడ్డాయి. తరువాత నెబుకద్నెజరు సముఖానికి తనను తోడుకొని పొమ్మని దానియేలు అర్యోకును అడిగాడు. ఆ మర్మాన్ని బయలుపరచక ముందు, తన కలను, కల యొక్క భావాన్ని చెప్పగల సామర్థ్యం పరలోకమందున్న దేవుని వద్దనుండియే కలుగుతుందని అతడు రాజునకు హామి యిచ్చాడు.

రాజును వేధించి, కలవరపెట్టిన కల ఏది? రాజు యొక్క కల “అంత్య దినముల”తో సంబంధం కలిగియున్నదని దానియేలు తెలియజేశాడు (దానియేలు 2:28). అది భవిష్యత్తును తెలుపుతుంది. కలలో రాజునకు బ్రహ్మాండమైన ఒక ప్రతిమ కనబడిందట. అది మహా ప్రకాశముతో, భయంకరమైన రూపముగలదై అతని యెదుట నిలిచింది. ఆ ప్రతిమ యొక్క శిరస్సు మేలిమి బంగారమును, దాని రొమ్మును భుజములును వెండియు, దాని ఉదరము తొడలును ఇత్తడివియు, దాని మోకాళ్లు ఇనుపవియు, దాని పాదములలో ఒక భాగము ఇనుపదియు ఒక భాగము మట్టిదియునైయుండెను – అని దానియేలు

తెలిపాడు. మరియు అతడింకా యిలా అన్నాడు, "చేతి సహాయము లేక తీయబడిన ఒక రాయి, యినుమును, మట్టియు కలిసిన ఆ ప్రతిమయొక్క పాదములమీద పడి దాని పాదములను తుత్తునియలుగా విరుగగొట్టినట్టు తనకు కనబడెను. అంతట ఇనుమును, మట్టియు, ఇత్తడియు, వెండియు, బంగారమును ఏకముగా దంచబడి కళ్లములోని చెత్తవలె కాగా వాటికి స్థలము ఎచ్చటను దొరకకుండ గాలి వాటిని కొట్టుకొని పోయెను. ప్రతిమను విరుగగొట్టిన ఆ రాయి సర్వభూతలమంత మహా పర్వతమాయెను. రాజు కనిన కల యిదేనని దానియేలు స్థిరంగా చెప్పాడు" (దానియేలు 2:31-35).

మరి ఈ కల యొక్క భావమేమి? బంగారు మయమైన ఆ శిరస్సు నెబుకద్నెజరేనట (దానియేలు 2:38). బబులోనులో తరువాత మూడు మహా బలీయమైన సామ్రాజ్యాలు లేస్తాయట: అందులో ఒకటి వెండి, మరొకటి ఇత్తడి, యింకొకటి మట్టితో మిళితమైయున్న యినుముతోను ప్రాతినిధ్యం వహిస్తాయి.

గొప్ప ప్రాతినిధ్యం కలిగిన రాజులున్న కాలంలో దేవుడు ఎప్పటికీ నాశనము కాని రాజ్యమును ఏర్పరుస్తాడు. అది రాజ్యాలన్నింటికంటె ఉన్నతమైనదిగా ప్రభవించి శాశ్వతంగా ఉంటుంది అని దానియేలు చెప్పాడు (దానియేలు 2:44). నెబుకద్నెజరు కల దానియేలు దినమునుంచి కాలాంతంవరకు గల చరిత్రనంతటిని రేఖా మాత్రంగా కాక, దానియేలు నాటనుండి రాజ్యములన్నిటిపైగా ఉన్న శాశ్వతమైన రాజ్యాన్ని దేవుడు స్థాపించేవరకు గల సంక్షిప్త చరిత్రనిస్తుంది.

నెబుకద్నెజరు కాంచిన కల, దానికి దానియేలు వివరణ దేవుని శాశ్వత రాజ్యం వచ్చునట్లుగా తెలిపే పాత నిబంధన ప్రవచనాలన్నింటిలో మహత్తరమైనది. పరలోక రాజ్యానికి సంబంధించిన స్థాపిత వాస్తవాలు దానిలోనే ఉండిపోయాయి. సంఘాన్ని గూర్చిన ఏ పఠనమైనా సరే, ఈ కలను గూర్చిన వివేచనను చేర్చుతుంది. అది దేవుని రాజ్యము యొక్క స్వభావ సిద్ధమైన సంగతులను బయలుపరచడం మాత్రమే గాక, ఆయన రాజ్యము స్థాపింపబడే సమయాన్ని కూడా సూచిస్తుంది.

## మూలత: అది దైవికమైనది

ప్రవచనము దేవుని రాజ్యము యొక్క దైవిక మూలాన్ని ప్రకటిస్తుంది. "ఆ రాజుల కాలములలో **పరలోకమందున్న దేవుడు** ఒక రాజ్యము స్థాపించును" అని దానియేలు తెలిపాడు (దానియేలు 2:44; ఒత్తి పలకడం నాది). రాజ్యము పరలోకమునుండి వస్తుంది, మరియు అది దేవునిచే సహాయముగా స్థాపింపబడుతుంది.

"చేతిసహాయము లేక (పర్వతంనుండి) తీయబడిన ఒక రాయి" (దానియేలు 2:34) అనేది – ఆ రాజ్యము నరులచేతులవలన కాక దేవునిచేతనే అది స్థాపింపబడునని సూచిస్తుంది. అది పరలోక సంబంధమైన రాజ్యమేకాని, భూసంబంధమైనది కాదు. నరుని ప్రసంగము, ఏర్పాట్లు, ఆలోచనలను బట్టి అది పుట్టదు; కాని కాలములో అద్భుతరీతిగా జరిగే సంఘటన ద్వారాను, భవిష్యత్తులో ఒకానొక స్థితి వద్ద అది స్థాపింపబడుతుంది.

రానున్న రాజ్యమును గూర్చిన సత్యమందు **స్వాభావిక బలము** గుప్తమై ఉంటుంది. దేవుని యొక్క మహా శక్తి దాని స్వభావాన్ని తెలుపుతుంది.

పరిశుద్ధమైన దాని మూలము **విశ్వసనీయమైన దాని నిర్మాణాన్ని** సూచిస్తుంది. లోకములోని గొప్ప సామ్రాజ్యాలే పొరపాటు పడదగిన మేధాశక్తి, వివేకంతో కూర్చబడి ఉన్నాయి. కాని, క్రీస్తు రాజ్యము మానవాతీత శక్తితోకూడిన దేవుని కార్యముతో సృజింపబడినదై లయముకాని లక్షణాలను కలిగియుంటుంది.

అలాగే, రాజ్యము యొక్క దైవికమైన స్వభావం, దాని **స్థిరమైన విజయానికి** హామి యిస్తుంది. తమ మొదటి ప్రయత్నం విఫలమైనందున తిరిగి చేయడం అనేది దేవుని విషయంలో ఎన్నడు తటస్థించదు.

ఆయన ఏ చేతితో చేశాడో,
అది ఎన్నడు విఫలం కాదు;
ఆయన ఏ నాలుకతో పలికాడో,
అది ఎన్నడు పొరబడదు;
ఆయన ఏ కలముతో వ్రాశాడో,
అది ఎన్నడు చెరగదు.
ఆయన ఏమి చెప్పినా,
అంతకంటే శ్రేష్ఠంగా చెప్పబడనేరదు;
ఆయన ఏమి జరిగించినా,
అంతకంటె శ్రేష్ఠంగా జరిగింపబడదు.

దానియేలు ప్రవచించిన రాజ్యము పైనుండి పంపబడుతుంది. అది దైవికమైన శాసనాన్ని బట్టి కదలికలో పెట్టబడుతుంది. దాని సృష్టికర్త యొక్క జ్ఞానమును నిత్యత్వాన్ని అది ప్రతిఫలింపజేస్తుంది.

## స్థాపనలో అది ప్రవచనంతో కూడింది

ప్రవచనం దేవుడు ప్రత్యేకించి కోరుకున్న రాజ్య స్థాపన సమయాన్ని కూడా సూచిస్తుంది. "**ఆ రాజుల కాలములలో** పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును దానికెన్నటికిని నాశనము కలుగదు" అని దానియేలు తెలిపాడు (దానియేలు 2:44; ఒత్తి పలకడం నాది). ఆ విగ్రహం చేత ప్రాతినిధ్య మియ్యబడిన రాజుల కాలములలో దేవుడు తన రాజ్యాన్ని స్థాపిస్తాడు. నాల్గవ రాజ్యపు పరిపాలనా కాలంలో మరింతగా ప్రత్యేకించి చెప్పబడింది.

నెబుకద్నెజరు యొక్క కలలో నాలుగు ప్రపంచ సామ్రాజ్యాలు చిత్రీకరించబడ్డాయి. నెబుకద్నెజరు యొక్క రాజ్యము మొదటిది (దానియేలు 2:37), అతని తరువాత మరి యొకటి రావాలి (దానియేలు 2:39), మూడవది రెండవదాని వెంట రావాలి (దానియేలు 2:39), అప్పుడు నాల్గవ రాజ్యం రావాలి (దానియేలు 2:40–43).

మూడు ప్రపంచ సామ్రాజ్యాలు బబులోను సామ్రాజ్యం వెంట బయలుదేరినట్టు మత సంబంధంకాని చరిత్ర చెప్తోంది. అవి: మాదీయ పారశీకము, గ్రీకు రోమా

సామ్రాజ్యాలు అనేవి. మాదీయ పారశీకము, గ్రీకు సామ్రాజ్యాలనేవి దాఖలు చేయబడిన దానియేలు దర్శనమందు వాటి పేర్లతోనే పిలువబడ్డాయి (8:20, 21).

దానియేలు నాల్గవ దాన్ని పేరుతో పిలువలేదు, అయితే అతడు దాని స్వభావాన్ని వర్ణించాడు: ఇనుము, మట్టి, బలము, బలహీనతల యొక్క మిశ్రితమని అతడు దాన్ని సూచించాడు. పాదములు, వ్రేళ్లు ఇనుము మట్టితో చేయబడినవని చెప్పాడు. అయితే, ఇనుము మట్టి అనేవి వివిధ రాజ్యాలను సూచించవు; కాని ఆ మిశ్రితము ఆ రాజ్యమందలి విభజనలను, సంఘీభావపు లేమిని సూచిస్తున్నాయి. రాజ్యములో అంతరంగీక ఐక్యతగాని లేక అంటుకొనియుండే లక్షణంగాని ఉండదు. నిరాక్షేపంగా, అది రోమా సామ్రాజ్యమే, ఎందుకంటే అది గ్రీకు సామ్రాజ్యం వెంట వచ్చింది, మరియు అది మిశ్రిత స్వభావం కలిగియుంది. మొదటిలో ఇనుమంత బలంగా ఉండి, ఇతర రాజ్యాలను నిర్దాక్షిణ్యంగా అణగద్రొక్కింది, అయితే కాలక్రమంలో అంతఃకలహాలకు గురియయ్యింది. జయింపబడిన దేశాల తిరుగుబాటులు స్వాతంత్ర పోరాటాల మధ్య అంతరంగ అనైక్యత బయటపడింది.

చేతి సహాయము లేకుండ పర్వతమునుండి వచ్చిన రాయి, విగ్రహానికి ఎదురుగా వచ్చి దాని పాదాలమీద పడింది. ఆ విగ్రహం యొక్క కాళ్లు నాల్గవ రాజ్యములో భాగమైయున్నందున, ఈ నిత్యరాజ్యము నాల్గవ రాజ్యం యొక్క ఉనికిలో వచ్చిందని తేలిపోయింది. క్రీస్తు ప్రభువు యొక్క పరిచర్యయు, మరియు సంఘ స్థాపనము, రోమా సామ్రాజ్యము లోకాన్ని ఏలే కాలంలోనే జరిగాయి. క్రీ.శ. 476లో రోమా సామ్రాజ్యము నాశనం చేయబడింది. అంటే క్రీస్తు యొక్క పరిచర్య, సంఘ స్థాపన అనేవాటి తరువాతనే గాని, వాటికి ముందుకాదు. అందువలన, దానియేలు యొక్క ప్రవచనం, దేవుడు తన రాజ్యాన్ని స్థాపించే కాలాన్ని గూర్చి నిర్దిష్టంగా చెప్పింది: రోమా సామ్రాజ్య కాలంలో ఆయన దానిని స్థాపిస్తాడు, మరియు రోమా సామ్రాజ్యం పతనమై గతించిపోయినా, దేవుని రాజ్యము నిరంతరం నిలుస్తుంది.

నేను సెర్సీ, ఆర్కన్‌సాస్‌లో నివసిస్తాను. అనేక పట్టణాలవలెనే దాని పరిమాణం (జనాభా: 18,000), దానికి చిన్న భాగాలున్నాయి. సెర్సీలోని క్లోవర్‌డేల్ అనే భాగంలో (లేక పేటలో) నేను ఉంటున్నానంటే, నేనెక్కడ ఉంటున్నానో అతని మనస్సు కుదురుగా ఆలోచింపగలదు. సెర్సీలో మా యిల్లు ఎక్కడుందో అతడు గుర్తించవచ్చు.

దేవుని రాజ్యం ఏ సంవత్సరంలో స్థాపింపబడుతుందో దానియేలు మనకు తెలియ జేయలేదు కాని "ఆ రాజుల కాలములో" అని అతడు మనకు సమయాన్ని సూచించాడు. అది సమయాన్ని తగ్గించుకొంటూ వస్తుంది. దేవుని రాజ్య స్థాపనాకాలాన్ని స్పష్టంగా ఎక్కడ చూడాలో మనకు తెలుసు.

## దాని వృద్ధిలో లోకవ్యాప్తమైనది

దేవుని రాజ్యముయొక్క ఆశ్చర్యం కలిగించు అభివృద్ధిని గూర్చి దానియేలు ప్రవచనం కొంత సూచిస్తుంది. "ప్రతిమను విరుగగొట్టిన ఆ రాయి **సర్వభూతలమంత మహా పర్వతమాయెను**" (దానియేలు 2:35; ఒత్తిపలకడం నాది).

చిన్నగా ప్రారంభమయిన ఆ రాజ్యం, త్వరలోనే సార్వత్రిక రాజ్యంగా వృద్ధి చెందుతుంది. మానవుని చేతి సహాయం లేకుండ పర్వతంనుండి తీయబడిన రాయి సర్వభూతలమంత మహా పర్వతమయ్యింది అనేది దాని వృద్ధిని గూర్చి తెలిపేదే.

తన ఉపమానాలలో ఒక దానియందు, పరలోక రాజ్యము యొక్క అభివృద్ధిని ఆవగింజ యొక్క అభివృద్ధితో ప్రభువైన యేసు పోల్చాడు. "అది విత్తనములన్నిటిలో చిన్నదేగాని పెరిగినప్పుడు కూర మొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును" అని ఆయన అన్నాడు (మత్తయి 13:32).

దేవుని రాజ్యము ఆలస్యములేని, బ్రహ్మాండమైన లోక వ్యాప్తపు స్థాయిలో తటాలున బయటపడుతుందని అటు దానియేలు ప్రవచింపలేదు సరికదా, యిటు ప్రభువైన యేసు కూడా బోధించలేదు. అయితే, దానియేలును, ప్రభువైన యేసును దాని పెరుగుదల విషయమై ప్రవచించి, కాలములో, నమ్మ శక్యముకానంత పలుకుబడిలోనికి రాజ్యము వృద్ధి చెందుతుందని చెప్పారు. చిన్నగా ఆరంభమై భౌగోళిక పరిమాణంలోనికి చేరేవరకు అది పెరుగుతుంది. దేవుని రాజ్యము పెద్దదిగా ఆరంభం కాక మెల్లని శబ్దంతో బయటికి వచ్చి, పైకి వ్యాపించి, భూమియందంతట విస్తరిస్తుంది.

బెన్‌టిన్ విల్లీ, ఆర్కన్‌సాస్‌లో స్యామ్ వాల్టన్ తన కోటానకోట్ల డాలరు వ్యాపారపు వాల్‌మార్ట్ స్టోరు చిన్న అయిదు, పది సెంట్ల స్టోరుగా ఆరంభించాడు. తన తొలి దుకాణం ఆరంభించడానికి అతడు అప్పు తెచ్చుకోవలసి వచ్చింది. ఆ వ్యాపారం అల్పంగా ఆరంభ మయ్యిందిగాని, అల్పంగానే మిగిలిపోలేదు. ఇప్పుడు ఆ కంపెనీ నాలుగైదు లక్షల మంది పనివారిని పెట్టుకుంది. తన మరణానికి ముందు స్యామ్ వాల్టన్ లోకంలో అందరిని మించిన ధనవంతుడయ్యాడు. అతని వ్యాపార సామ్రాజ్యము యొక్క విశేషమైన విస్తరణ, దేవుని రాజ్య విస్తరణలో ఏ మూలకూ పోల్చబడదు (ప్రకటన 7 చూడు). దానియేలు ప్రకారం, దేవుని రాజ్యము చిన్న రాయినుండి సర్వభూతలమంత మహాపర్వతమయ్యింది, ఒక సంభవంనుండి బలీయమైన ఉద్యమంగా మారింది.

## నిరంతర స్వభావము కలది

రానున్న రాజ్యము యొక్క శాశ్వత స్వభావము, మరియు, దైవికమైన బలము అనేవాటిని గూర్చి దానియేలు ప్రవచనం నొక్కి పలుకుతుంది. "ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును" (దానియేలు 2:44). ఆ రాజ్యానికి నిలిచియుండే శక్తి ఉంటుంది. తక్కిన రాజ్యాలన్నీ అంతరించితే అది మాత్రం సజీవంగా ఉంటుంది.

పర్వతంలోనుండి చేతి సహాయము లేకుండ తీయబడిన రాయి ఆ ప్రతిమ యొక్క కాళ్లమీద పడుతుందని దానియేలు తెలిపాడు. ప్రతిమ పడగొట్టబడింది; దాని బంగారు, వెండి, ఇత్తడి, ఇనుము, మరియు మట్టి ఏకముగా దంచబడిన కళ్లములోని చెత్తవలె గాలికి కొట్టుకొనిపోయాయి.

మన ప్రాంతంలో ధాన్యపు నూర్పిడి వంటి దృశ్యంలా అది కన్పిస్తుంది. పంటనూర్పిడి

చేసి సాయంకాలపు గాలికి తూర్పారపట్టడం మనకు ఎరుకైన విషయమే. దేవుని రాజ్యముతో పోల్చితే, ముందు చెప్పబడిన నాలుగు రాజ్యాలు గాలి చెదరగొట్టు పొట్టువలె విలువలేనివై యుంటాయి.

గతము, ప్రస్తుతము, భవిష్యత్తుకు సంబంధించిన మానవ రాజ్యాలన్నిటికంటెను దేవుని రాజ్యము మహా శక్తివంతమైనదై ఉంటుంది. మానవ రాజ్యాలచేత అది ఎన్నడు జయింపబడదు లేక లోక రాజ్యాలన్నీ ఏకమైనా దానిని ఏమియు చేయనేరవు; "ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు" (దానియేలు 2:44).

---

**దేవుని రాజ్యములో భాగమైయుండడం**
**ఓడింపబడనేరని సైన్యములో**
**ఉన్న దానిని పోలియుంది.**

---

దానియేలు యిలా అన్నాడు: "... పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగములవరకు నిలుచును" (దానియేలు 2:44). దానియేలు వినియోగించిన మూడు పద సముదాయాలు నిరంతర తత్వాన్ని నిక్షేపిస్తాయి; "దాని కెన్నటికిని నాశనము కలుగదు," మరియు "దానిని పొందినవారికి గాక మరెవరికిని చెందదు"; "అది యుగములవరకు నిలుచును." ఒకసారి స్థాపింపబడిందంటే మాత్రం ఈ రాజ్యం నిరంతరం నిలుస్తుంది.

"రేపేమి తెస్తుంది?" అని నిగూఢంగా మనం అందరం అడుగుతాం; లేక "రాబోయే మన ప్రపంచం ఎలా ఉంటుంది?"; ఎన్నటికి లయముకాని రాజ్యంలో మనం భాగమై ఉండవచ్చుననే బలపరచు సందేశాన్ని దానియేలు గ్రంథం తెస్తుంది.

ఎదుర్కొనవలసిన శత్రువు యొక్క బల పరిమాణం ఎంతదైనా, దేవుని రాజ్యములో భాగమైయుండడం, జయింపబడని సైన్యములో ఉన్నదానిని పోలియుంది. దేవుని రాజ్యపు పౌరుల మనస్సుల్లోనికి అపజయమనే ఆలోచన ఎక్కనే ఎక్కదు. కన్పించని రేపైనా, తెలియబడని శత్రువైనా మనలను ఎన్నడు భయపెట్టనేరవు.

పందెపు వేటగాని గూర్చి ఒక కథ చెప్పబడింది. తాను గెలుచుకున్న బహుమనాలున్న గదిలోనికి తన స్నేహితుని తీసికొనిపోయాడట. ప్రపంచమంతట తిరిగి వేటాడి సంపాదించిన అడవి జంతువుల తలలు అక్కడ వరుసగా పెట్టబడి ఉన్నాయట. వాటన్నిటి మధ్య ఒక ప్రత్యేకమైన స్థలములో కత్తిరించబడిన సింహము యొక్క తోక పెట్టబడి యుందట. "సింహం యొక్క తోకను ఎందుకు ప్రత్యేకంగా ఉంచావు? సింహపు తలయే పెట్టియుంటే బాగుండేదే" అని అతని స్నేహితుడు అతన్ని అడిగాడట. "నేను సింహాన్ని కనుగొనేటప్పటికి ఎవరో దాని తలను కోసికొని పోయారు" అని ఆ వేటగాడు అంగీకరించాడట. ముందుగానే ఎవరైనా సింహపు తలను నరికితే, దాని తోకను

నరకడం సులభమే!

అలాగే, విజయం ముందుగానే సాధింపబడిందని తెలిసియుంటే, విజయవంతమైన జీవితాన్ని జీవించడం సులభంగా ఉంటుంది. దేవుని రాజ్యము ఎన్నడును ఓటమిని చవి చూడదు. ఆ రాజ్యము యొక్క స్థాపనకు ముందుగానే దాని శౌర్యము లోకముపై దాని తిరుగులేని విజయము అనేవి సూచింపబడ్డాయి. గనుక క్రైస్తవుడు విజయం కొరకు కాక విజయమునుండి పని చేస్తాడు. ఓటమి అనే సింహపు తల ముందుగనే తుంచివేయబడింది అనే అభయంతో అతడు జీవిస్తాడు. పుస్తకం యొక్క చివరి పేజీని మనం చదివాం. దేవుని పిల్లలకు మానవ చరిత్ర యొక్క కథ విమోచన యొక్క నిత్య ఉత్సవంతో దేవుని సింహాసనం చుట్టు చేరినప్పుడు ముగుస్తుంది.

## ముగింపు

క్రొత్త నిబంధనలో దానియేలు ప్రవచనపు నెరవేర్పును మనం చూస్తామా? జవాబు కొరకు అపొ. 2లో చూద్దాం.

**రానున్న రాజ్యము ప్రభువుచేత స్థాపింపబడుతుందని, ఆ విధంగా అది దైవికమైన మూలము కలిగి యుంటుందనియు దానియేలు చెప్పాడు.** అపొ. 2లో పరిశుద్ధాత్మ అద్భుతరీతిగా అపొస్తలుల మీద కుమ్మరించబడగా సువార్త యుగము మానవాతీతంగా సంఘారంభంలో ప్రవేశించింది. అపొస్తలులపై అద్భుతరీతిగా పరిశుద్ధాత్మ దిగి వచ్చినప్పుడు రాజ్యం వస్తుందని తన పరిచర్యలో ప్రభువైన యేసు సూచించాడు (మార్కు 9:1; లూకా 24:46–49).

**రానున్న రాజ్యము రోమా సామ్రాజ్య కాలములో స్థాపింపబడుతుందని ప్రవచనమందు సూచింపబడింది.** అపొ. 2 ఆ కాలానికి తగినట్టుగా సరిపోతుంది. ఎందుకంటే ఆ కాలంలో రోమా సామ్రాజ్యమే లోకమంతటిని ఏలింది.

**దానియేలు ప్రకారం, రానైయున్న రాజ్యం చిన్నదిగా ప్రారంభించి లోక రాజ్యముల కంటె శక్తిమంతమైనదిగా ఉండును.** అపొ. 2లో 3000 మందితో ప్రారంభమై లోకమును తాకునంతగా అభివృద్ధిచెందింది.

**రానున్న రాజ్యము లోకరాజ్యములన్నిటికంటె బలముగా ఉంటుందని దానియేలు చెప్పాడు.** సంఘ స్థాపనను గూర్చి ప్రభువైన యేసు మాట్లాడుతూ, "పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవు" అని తెలియజేశాడు (మత్తయి 16:18).

**రానున్న రాజ్యము శాశ్వతమైనదని పరలోకమందున్న దేవుడు దానియేలుకు బయలు పరచాడు.** అపొ. 2లో సంఘం స్థాపింపబడిన తరువాత, మిగిలిన క్రొత్త నిబంధన దాని వృద్ధిని గూర్చియు, శాశ్వతమైన జీవితాన్ని గూర్చియు తెలుపుతుంది.

అపొ. 2లో సంఘ స్థాపనతో దానియేలు ప్రవచనం నెరవేర్చబడిందనే సందేహమైనా ఉందా? దేవుడు స్థాపించే శాశ్వత రాజ్యము సంఘమే.

క్రీస్తు సంఘము, నిత్యరాజ్య సభ్యుడైయుండడంలోని లాభము విదితమే. దేవుడు లోకంలో ఏమి చేస్తున్నాడో దానిలో భాగము దేవుని రాజ్య పౌరులైయున్నారు. ఈ పౌరులు

విజయంలో జీవిస్తారు, ఎందుకంటే దేవుని రాజ్యము మానవుల రాజ్యముల కంటెను బలమైనది, అది మరణముకంటెను బలమైనదే. ప్రవచింపబడిన ఈ నిత్యరాజ్యపు పౌరులు దేవునితో శాశ్వతమైన భవిష్యత్తు కలిగియుంటారు. జరిగిపోయే కాలంతో పాటు, నిమగ్నమైయున్న వారి జీవితపు పని వాడిపోయేదో లేక చెరిగిపోయేదో కాదు.

నిత్య రాజ్యంలో నివసించినందుకు గల లాభాలను సమ ఉజ్జీలు పాల్గొన్న పరుగు పందాన్ని తిలకించడంవల్ల నేర్చుకోవచ్చు. ఆట అవుతున్నకొద్దీ, మనం ఏ జట్టును చప్పట్లు తట్టి ప్రోత్సహిస్తున్నామో, ఆ జట్టు గెలుస్తుందో లేదో చెప్పలేం. ఆ ఆట ఎలా అంతమౌతుందో తెలియని కారణాన మనం చాల ఆతురతగా ఎదురు చూస్తూ ఉంటాం. "ఒక ఆటలో ఉత్సాహాన్ని కలిగించేది అదే. అది ఎలా అంతమౌతుందో నీకు తెలియదు" అని మనం అనవచ్చు. అది ఆట విషయంలో నిజమే కాని జీవితం విషయంలో అది నిజం కాదు. ఈ జీవితం ఎలా ముగించబోతుందో తెలియని వ్యక్తియెడల జాలి చూపాలి. అతడు గెలిచే జట్టులో ఉన్నాడో లేడో ఎరుగకుండగనే ఈ జీవితంనుండి అతడు పోవలసి వస్తే, సువార్తయే తప్ప మరేదియు గాఢంగా తిష్టవేసికొన్న దుఃఖాన్ని తొలిగించలేదు. తన జీవితం ఎలా అంతమౌతుందో క్రైస్తవునికి తెలుసు: నిత్యరాజ్యంలో భాగంగా, పరలోకమందలి దేవునితో అతడు నిరంతరం ఉండబోతాడు.

దీని వెలుగులో, మనం దేవుని నిత్యరాజ్యంలో భాగమైయుంటే, మనం ఏమి పోగొట్టుకుంటున్నాం అనే విషయం ప్రాముఖ్యత వహించదు. దేవుని నిత్యరాజ్యంలో మనం భాగమైయుంటే, మనం ఏమి సంపాదించు కొంటున్నామనే విషయంలో కూడా ఏ వ్యత్యాసముండదు. తాత్కాలికమైనది శాశ్వతంగాను, మర్త్యమైనది అమర్త్యంగాను మార్పు చెందునప్పుడు, వారు దేవుని నిత్యరాజ్యంలో ప్రవేశిస్తారు. "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును" అని ప్రభువైన యేసు అన్నాడు (యోహాను 11:25). దేవుని రాజ్యములో, భౌతికమైన మరణము సహితం హాని చేయనేరదు అందువలననే, "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" అని పౌలు వ్రాశాడు (ఫిలిప్పీ. 1:21). పరిశుద్ధులకు మరణం అనేది బాధ కాదు – లాభము – ఆశీర్వాదమే, గాని వినాశం కాదు.

నీవు ఈ లోకం కొరకే జీవించినట్టయితే, నీవు ఈ లోకాన్ని రాబోయే లోకాన్ని సహా పోగొట్టుకుంటావు – అంటే నీవు, రెండింటిని పోగొట్టుకుంటావన్నమాట. నీవు రాబోవు లోకం కొరకు జీవించినట్టయితే – ఈ లోకాన్ని, రాబోవు లోకాన్ని కూడా పొందుతావు, నీవు రెండింటిని పొందుతావు.

## పఠనము మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. నెబుకద్నెజరు జ్ఞానులు రాజు యొక్క కల భావాన్ని ఎలా తెలుపలేకపోయారు?
2. కల భావాన్ని దేవుడు అతనికి యిచ్చినప్పుడు దానియేలు ఏమి చేశాడు?
3. తన కలలో నెబుకద్నెజరు చూచిన ప్రతిమను వర్ణించు.
4. ప్రతిమయందలి ప్రతి భాగానికి దానియేలు ఏమని భావం చెప్పాడు?

5. ఆ కల చరిత్రలోని ఏ భాగానికి చెందింది?
6. ఈ నిత్యరాజ్యాన్ని స్థాపించేదెవరు? ఈ స్థాపన కలయందు సాంకేతికంగా ఎలా ప్రాతినిధ్య మియ్యబడింది?
7. నిత్యరాజ్యము ఎప్పుడు స్థాపింపబడుతుంది?
8. రోమా సామ్రాజ్యము ఎలాటి సామ్రాజ్యము? కలలో అది ఎలా చిత్రించ బడింది?
9. దేవుని రాజ్య విస్తరణను వర్ణించడానికి ఈ క్రింది వాటిలో శ్రేష్ఠమైన వర్ణన ఏది? (ఎ) చిన్నదానినుండి లోకవ్యాప్తంగా, (బి) లోకవ్యాప్తంనుండి చిన్నదిగా, (సి) లోకవ్యాప్తంనుండి లోకవ్యాప్తంవరకా?
10. దేవుని రాజ్యము యొక్క బలము కలలో ఎలా ప్రదర్శింపబడింది?
11. రాజ్యము శాశ్వతమైనదని చెప్పడానికి దానియేలు 2లో ఎట్టి పద ప్రయోగాలు చేయబడ్డాయి?
12. దానియేలు ముందుగా సూచించిన రాజ్యము, సంఘము ఒక్కటేయనడానికి అటు తార్కిక జ్ఞానంనుండి యిటు లేఖనాల్లోనుండి నిరూపించు.
13. నిత్య రాజ్యము యొక్క పౌరుడైయున్న మేళ్లను పేర్కొనుము.